

కేటీకే ఓసీ-3 ఉపరితల గనిని పరిశీలిస్తున్న డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్

## కేటీకే ఓసీ పరిశీలన

కృష్ణకాలనీ, అక్టోబర్ 29: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ–2, ఓసీ–3 గనులను డైరెక్టర్ ఆపరేషన్ ఎన్వీకే శ్రీనివాస్, ఏరియా ఇన్‌చార్జి జీఎం బండి వెంకటయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు కేటీకే ఓసీ–2, ఓసీ–3 గను వ్యూ పాయింట్ వద్దకు వెళ్లి గని ప్లాన్లను పరిశీలించి, ఉపరితల గనుల్లో జరుగుతున్న పని విదానాల స్థితి గతులను, యంత్రాల పని తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసకున్నారు. డైరెక్టర్ ఆపరేషన్ ఎన్వీకే శ్రీనివాస్ మాట్లాడుతూ భూపాలపల్లి ఏరియాలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను ఛేదించడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేసుకొని, రక్షణతో కూడుకున్న ఉత్పత్తిని సాధించాలన్నారు. సంస్థలో ఉద్యోగులందరూ సమష్టిగా పని చేస్తూ, ఉత్పత్తి శాతాన్ని పెంచి, కంపెనీ మనగుడకు తోడ్పడాలన్నారు. ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారం, ఎస్‌వోటూ జీఎం ఎన్వీ రావు, ప్రాజెక్టు అధికారి వెంకటరామిరెడ్డి, పాల్గొన్నారు.

## మాన్యువల్ సవరణకు సానుకూలం

గోదావరిఖని, అక్టోబర్ 29: సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ మాన్యువల్–2023లో 15 సవరణలు చేసేందుకు ఆ సంస్థ డైరెక్టర్ (పా) ఫైనాన్స్, సివిల్ జీఎంలు సానుకూలత వ్యక్తం చేసినట్లు సివిల్ కాంట్రాక్టర్స్ ఆల్ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కనుకుల మొండయ్య తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో వారిని ఆదివారం కలిసి విన్నవించినట్లు తెలిపారు. సివిల్ కాంట్రాక్టర్స్ మాన్యువల్–2023లో కొత్త నిబంధనల ద్వారా 11 ఏరియాల కాంట్రాక్టర్లలో చాలా మంది చిన్న చిన్న పనులు చేసేవారే ఉన్నారనీ, వారిని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక భారం మోపకుండా సవరణ చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమస్య పూర్తిగా పరిష్కారం తర్వాతే టెండర్ల ప్రక్రియలో పాల్గొంటామని చెప్పినట్లు తెలిపారు.

## బీఆర్‌ఎస్వీ ప్రతినిధుల సమావేశానికి తరలిన నాయకులు



తెలంగాణ భవన్‌లో గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో మంచిర్యాల నియోజకవర్గం నాయకులు

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 29: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కో–ఆర్డినేటర్స్, నియోజకవర్గాల ప్రతినిధుల సమావేశానికి నస్పూర్ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్వీ మంచిర్యాల నియోజకవర్గం అధ్యక్షుడు దగ్గుల మధు కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నస్పూర్ ప్రాంత నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌ను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, మ్యానిఫెస్టోపై విస్తృత చర్చ జరపాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులు కొనసాగాలంటే, గులాబీ జెండా ఎగరాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి, చిప్పకుర్తి జగన్, మహ్మద్ సాజిద్ చోటు, కిరీటి, నక్క తిరుపతి, సాజిద్, ఎగ్గణ సాయికిరణ్, చిట్టి బాద్షా, అంజత్‌ఖాన్, శ్రావణ్, ప్రవీణ్, తదితరులున్నారు.

# కేసీఆర్‌ను గెలిపించుకుందాం..

- కార్మిక వర్గమంతా కలిసిరావాలి
- ఎన్నో హక్కులు కల్పించిన ఘనత ఆయనదే..
- సంస్థ బతకాలంటే గులాబీ జెండా ఎగరాలే..
- పెద్దపల్లి ఎంపీ వెంకటేశ నేతకాని, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు, ఎమ్మెల్యే దివాకర్‌రావు
- నస్పూర్‌లో కార్మికులు, రిటైర్డ్ కార్మికులతో సమావేశం
- పాల్గొన్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య



మాట్లాడుతున్న మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 29: దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించుకుందామని పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతకాని, మంచిర్యాల నియోజకవర్గం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భానుచందర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు పేర్కొన్నారు. నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని మాట్లాడుతూ కార్మికులకు ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తు చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో తాను కూడా ఐటీ రద్దు చేయాలని పట్టుబట్టినా స్పందించలేదని ఎంపీ తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో సింగరేణి కార్మికుల ఓట్లే కీలకమని, బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని కోరారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు మాట్లాడుతూ అనేక ఉద్యమాల్లో సింగరేణి కార్మికుల పాత్ర కీలకమన్నారు. చైతన్యవంతులైన సింగరేణి కార్మికులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాభివృద్ధి పథకాలు, సాధించిన హక్కులను గుర్తు చేసుకొని బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని కోరారు. పొరపాటున ఇతర పార్టీలకు ఓటేస్తే అభివృద్ధిలో మనం వెనక్కి వెళ్లడం తప్పదన్నారు. సీఎం కేసీఆర్ దిశానిర్దేశంలోనే సింగరేణి అభివృద్ధిలో దూసుకుపోతున్నదని, వారి కష్టాన్ని చూసి కార్మికులకు అనేక హక్కులు కల్పిస్తున్నారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు స్పష్టం చేశారు. తాను మంచిర్యాల నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎమ్మెల్యే అయ్యానని, తన గెలుపులో సింగరేణి ప్రాంత కార్మికులు, కార్మికేతరుల కృషి ఎంతో ఉందన్నారు. కార్మికులకు అనేక హక్కులు కల్పించిన సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలంటే మంచిర్యాల గడ్డంపై మరోసారి గులాబీ జెండాను ఎదురవేయాలని కోరారు. రౌడీయిజం, గుండాయిజం చేసే వారికి ఓటు వేస్తే అభివృద్ధి జరగదని, వందలాది కోట్లు బ్యాంకులకు ఎగనామం పెట్టిన కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేస్తే ఆయన దగ్గరకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు వెంగల కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, ఏరియా కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కాశీరావు, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గర్శె రామస్వామి, ఏరియా స్థాయి నాయకులు, అన్ని గనులు పిట్ కార్యదర్శులు, కార్మికులు, విశ్రాంత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 32 శాతం లాభాల వాటా చెల్లింపు..



మాట్లాడుతున్న వెంకట్రావ్

ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో సింగరేణి సంస్థ లాభాల్లో దూసుకెళ్తున్నదని, సంస్థకు వచ్చిన లాభాల్లో నుంచి ఏడాదికేడాది పెంచుతూ కార్మికులకు వాటాను చెల్లించడం జరుగుతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో 16శాతం ఉన్న లాభాల వాటాను తెలంగాణకు కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పదేళ్ల కాలంలో 32 శాతానికి పెంచారని, తద్వారా కార్మికులు లక్షల్లో లాభాల వాటాను తీసుకోవడం జరిగిందన్నారు. దేశంలో ఏ బొగ్గు పరిశ్రమలో లేని హక్కులు సింగరేణి సాధించామని, ప్రైవేటీకరణ కాకుండా ఉండాలంటే మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. కార్మికులంతా బీఆర్‌ఎస్ వైపు నిలబడాలని కోరారు. సీఎం కేసీఆర్ వారసత్వ ఉద్యోగాలు ప్రకటిస్తే ఏఐటీయూసీ కోర్టుకు వెళ్లి అడ్డుకుందని ఆరోపించారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ కారుణ్య నియామకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇప్పుడు సింగరేణి అంతా యువ కార్మికులతో కళకళలాడుతున్నదన్నారు. సింగరేణి మనుగడలో ఉండాలంటే తప్పని సరిగా బీఆర్‌ఎస్ పార్టీ గెలవాలని, కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, యువకార్మికులు గట్టి మద్దతునివ్వాలని కోరారు.

## కేసీఆర్‌తోనే కార్మికులకు బంగారు భవిష్యత్

కార్మికుల బంగారు భవిష్యత్తు కేసీఆర్‌తోనే సాధ్యమని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య అన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు కేసీఆర్ వెంటే నడిచారని, రాష్ట్రం కోసం 35 రోజులు సమ్మెలో పాల్గొన్నారని గుర్తుచేశారు. కార్మికుల రుణం తీర్చుకోవడానికి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కార్మికులకు అనేక హక్కులు కల్పించారని వివరించారు. సింగరేణిలో కారుణ్యంతో పాటు వివిధ నోటిఫికేషన్ల ద్వారా 18వేల మందికి ఉద్యోగాలు ఇప్పించారని తెలిపారు. తొలిసారిగా సింగరేణిలో కారుణ్యం ద్వారా మహిళలకు ఉద్యోగావకాశం కల్పించినట్లు చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకుంటే సీఎం కేసీఆర్ అడ్డుకున్నారని గుర్తు చేశారు. మా బతుకైనా.. భవిష్యత్తు అయినా.. గులాబీ జెండానే అనే రీతిలో ఎన్నికల్లో కార్మికవర్గమంతా పనిచేయాలని కోరారు. కార్యకర్తలంతా తాము సాధించిన హక్కులు, కల్పిస్తున్న సౌకర్యాలను గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద కార్మికులతో చర్చించాలని, బీఆర్‌ఎస్‌కు ఓటు వేసే విధంగా వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సింగరేణి బతకాలంటే మళ్లీ గులాబీ జెండా ఎగురవేయాలని, మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే సింగరేణి మరింత లాభాల్లోకి వెళ్తుందన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు నెలరోజుల పాటు పార్టీ గెలుపుకోసం శ్రమించాలని ఆయన కోరారు.

## కార్మికుల కష్టాలను తీర్చిన సీఎం కేసీఆర్



మాట్లాడుతున్నఅరవింద్ రెడ్డి

కార్మికుల కష్టాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చారని, బీఆర్‌ఎస్‌ను మరోసారి బంపర్ మెజార్టీతో గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి కార్మికులను కోరారు. నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గులాబీ పార్టీయే విజయం సాధిస్తుందని, సింగరేణి కార్మికులంతా సీఎం కేసీఆర్ వెంటే నడుస్తున్నారని అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని హక్కులు సింగరేణి కార్మికులకు కల్పిస్తున్నారని వివరించారు. లాభాల వాటా చెల్లింపులు ఏ పరిశ్రమలో లేదని, కేవలం సింగరేణిలోనే ఉందన్నారు. కార్మికుల ఇండ్లలో సంతోషాన్ని నింపుతున్న కేసీఆర్‌కు అందరూ అండగా ఉండాలని, ప్రతి కార్మికుడు, రిటైర్డ్ కార్మికుడు వారి కుటుంబ సభ్యులవే కాకుండా ఒక్కొక్కరు బీఆర్‌ఎస్ పార్టీకి 50 ఓట్లు వేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇక్కడ పోటీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఎమ్మెల్సీగా ఉన్న కాలంలో 6వేల మందికి ఉత్తుత్తి ఇంటి పట్టాలు ఇప్పించి చేతులెత్తేశాడని, ఎమ్మెల్యే దివాకర్‌రావు సింగరేణి స్థల నివాసులకు దాదాపు 3500 పట్టాలు ఇప్పించారని చెప్పారు. కోల్‌బెల్ట్‌లో బీఆర్‌ఎస్‌కు 20 వేల మెజార్టీ వచ్చే విధంగా అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు.





నస్పూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులు